ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7 । కనిష్ఠం 25.6



నిర్మల్ జిల్లా వార్తలు

శుక్రవారం 8 ఆగస్టు 2025



గొర్రెల పంపిణీపై.. ఆరా!

- రంగంలోకి ఇంటలిజెన్స్ వర్గాలు
- రెండో విడతల్లో జరిగిన పంపిణీపై వివరాల సేకరణ
- వెలుగు చూడనున్న అవకతవకలు
- అప్పటి ప్రజా ప్రతినిధులు, పైరవీదారుల పాత్రపై అనుమానాలు

నిర్మల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా జరిగిన గొర్రెల పంపిణీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు వెల్లువెత్తుతున్న ఆరోపణలు అన్నీ ప్రభుత్వ శాఖల్లో దుమారం రేపుతున్నాయి. 2017 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. అయితే మొదటి నుంచి ఈ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదులు అప్పట్లోనే వెల్లువెత్తాయి. అప్పటి కొంత మంది ప్రజా ప్రతినిధులు, దళారులతో పాటు పలువురు సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది కుమ్మక్కై పెద్ద ఎత్తున అక్రమాలకు తెర తీశారని అప్పట్లోనే ఫిర్యాదులు వచ్చాయి. బినామీల పేరిట ఈ స్కీంలను పక్కదోవ పట్టించారన్న ఆరోపణలున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గొర్రెల పంపిణీ స్కాంపై దర్యాప్తు మొదలుపెట్టడంతో నిర్మల్ జిల్లాలో జరిగిన అక్రమాల వ్యవహారం కూడా తెరపైకి వస్తోంది. నిర్మల్ జిల్లాలో రెండు విడతలుగా చేపట్టిన గొర్రెల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందడంతో ఈ వ్యవహారంపై ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తుండడం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఇంటలిజెన్స్ అధికారులు రెండు విడతలుగా జరిగిన గొర్రెల పంపిణీ వివరాలను సేకరించడంలో నిమగ్నమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే తీగలాగితే డొంక కదలబోతున్న చందంగా గొర్రెల పంపిణీలో అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగు చూడబోతున్నాయని అంటున్నారు.

మొదటి విడతలో 6,919 యూనిట్ల మంజూరు

కాగా 2107 సంవత్సరంలో మొదటి విడతగా 6,919 గొర్రెల యూనిట్లను మంజూరు చేశారు. దీని కోసం జిల్లాకు రూ.86.48 కోట్లను కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.1.75 లక్షలుగా ఖరారు చేశారు. ఇందులో నుంచి లబ్ధిదారుడు 25 శాతం పేరిట 35,250లను చెల్లించారు. మిగతా 75 శాతం సబ్సిడీ కింద ఒక్కో లబ్ధిదారునికి రూ.93,750 అందించారు. ఈ డబ్బులతో లబ్ధిదారులు గొర్రెలను కొనుగోలు చేయడమే కాకుండా వాటికి బీమా సౌకర్యాన్ని, రవాణా, మందులు, దానా ఖర్చులను సైతం ఈ డబ్బుల నుంచే వ్యయం చేయాల్సి ఉంది. ఒక్కో యూనిట్ కింద మొత్తం 20 గొర్రెలు అలాగే ఒక గొర్రె పొట్టేల్‌ను లబ్ధిదారులు కొనుగోలు చేసి వాటి పెంపకం ద్వారా ఉపాధి పొందాలని లక్ష్యంగా నిర్ధారించారు. అయితే కొంత మంది గొర్రెలను కొనుగోలు చేయకుండానే కొనుగోలు చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారన్న ఫిర్యాదులున్నాయి. దీంతో పాటు నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేయకుండా వాటిని మళ్లీ అమ్ముకున్నట్లు కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. మొత్తం మొదటి విడతలో ఒక యూనిట్‌కు రూ.1.25లక్షలను ప్రభుత్వం చెల్లించింది. అప్పట్లోనే ఈ వ్యవహారంపై అనేక ఫిర్యాదులు అంది నప్పటికీ రాజకీయ ఒత్తిడులు మొదలవ్వడంతో ఎలాంటి చర్యలు జరగలేదు.

రెండో విడతను వదలని అక్రమార్కులు

కాగా 2023 జూన్ నుంచి మొదలైన రెండో విడత గొర్రెల పంపిణీలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదులున్నాయి. దీనికి ముందుగానే జరిగిన ఈ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పెద్ద ఎత్తున బినామీలు గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అయితే మొదటి విడత కన్నా రెండో విడతలో ఒక్కో యూనిట్ ధరను పెంచారు. మొదటి విడత రూ.1.25లక్షలు కాగా రెండో విడతలో రూ.50వేలు అదనంగా పెంచి యూనిట్ విలువను రూ.1.75లక్షలకు పెంచారు. మొత్తం 977 మంది లబ్ధిదారులను రెండో విడత కింద ఎంపిక చేశారు. అయితే ఇందులో నుంచి 625 యూనిట్లను మాత్రమే మంజూరు చేసి మిగతా 352 యూనిట్‌లను ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా నిలిపివేశారు. అలాగే లబ్ధిదారుల వాటాను సైతం వారికి తిరిగి ఇచ్చేశారు. అయితే మొత్తం 625 యూనిట్ల ఎంపికలోనూ అలాగే గొర్రెల కొనుగోలు ఇతర వాటిలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

రంగంలోకి ఇంటలిజెన్స్

ఇదిలా ఉండగా జిల్లాలో రెండు విడతలుగా జరిగిన సబ్సిడీ గొర్రెల యూనిట్‌ల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్కీంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రభుత్వం నిర్ధారించిన కారణంగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులే కాకుండా ఇంటలిజెన్స్ వర్గాలు దీనిపై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు విడతల్లో జరిగిన లబ్ధిదారుల ఎంపిక వ్యవహారంతో పాటు ముఖ్యంగా గొర్రెల కొనుగోళ్లపై ఇంటలిజెన్స్ వర్గాలు పకడ్బందీగా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా మంది లబ్ధిదారులను కొంత మంది దళారులు బుట్టలో వేసుకొని వారిని గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాల్లోకి తీసుకు వెళ్లడం అలాగే నాణ్యత లేని బలహీనమైన గొర్రెలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరలకు కొనుగోలు చేసినట్లుగా లెక్కలు చూపడం అలాగే బీమా, రవాణా, దానా లాంటి సౌకర్యాలను కల్పించకపోవడం వెనక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఫిర్యాదులను సైతం ఇంటలిజెన్స్ వర్గాలు పరిగణలోకి తీసుకుంటున్నాయని సమాచారం.

ఎస్సారెస్పీ సరస్వతి కెనాల్ నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

సోన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) సరస్వతి కాలువ ద్వారా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దిగువకు నీటిని విడుదల చేశారు. 800ల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. సరస్వతి కెనాల్ పరివాహక ప్రాంత రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, చిన్నయ్య, నాయకులు సరికెల గంగన్న, హరీష్ రెడ్డి, రమేష్, రాజేశ్వర్, ముత్యం రెడ్డి, నర్సారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సాగర్, అశోక్, నరేష్, సాయన్న, సంతోష్, గంగారెడ్డి, గంగయ్య, నాగయ్య, సాయినాథ్, నర్సయ్య, గణేష్, నాగరాజ్, భూమేష్, ప్రశాంత్, సట్వాజీ, ముత్యం, ఇరిగేషన్ ఈఈ అనిల్, డీఈ నరేష్, ఏఈతో పాటు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్ నిర్మల్‌లో నిర్మించాలి

- జిల్లా కేంద్రం భయట నిర్మించడం సరికాదు
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

నిర్మల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా అండ్ సెషన్స్ న్యాయాధికారి, ఇతర న్యాయస్థానాల కోసం నిర్మించనున్న కోర్టు కాంప్లెక్స్ భవన సముదాయాన్ని నిర్మల్ వెలుపల కాకుండా నిర్మల్‌లోనే నిర్మించాలని నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. గురువారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టుభవనాన్ని నిర్మల్ పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం తొలగించిన ప్రాంతాన్ని కలుపుకొని, ప్రస్తుతం కోర్టు ఉన్న స్థలంలో కాని, కలెక్టర్ రెసిడెన్స్ నిర్మిస్తామంటున్న పాత ఇరిగేషన్ కన్స్ట్రక్షన్ ఆఫీస్ ఏరియాలో గాని నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కోర్టు ప్రాంగణం 3.20 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని, నూతనంగా నిర్మించే కోర్టు భవన సముదాయానికి 5 ఎకరాల స్థలం అవసరమని హైకోర్టు సూచించిందన్నారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మాణం చేయడంతో ప్రజలు అక్కడికి వెళ్లేందుకు నానా తిప్పలు పడుతున్నారన్నారు. నిర్మల్ వెలుపల మహిళా ప్రాంగణం ప్రాంతంలో నిర్మిస్తే నిర్మల్, ఖానాపూర్, భైంసా ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అంపోలి నర్సారెడ్డి, బార్‌అసోసియేషన్ బృందం వంశీకృష్ణ, రత్నం, మధుకర్, సాయికుమా ర్, రమణ, రాజు ఉన్నారు.

పశువులకు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



కనకాపూర్‌లో పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

లక్ష్మణచాంద, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో నిర్వహించిన పశువుల టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పశువైద్యులతో మాట్లాడి బ్లూటంగ్ వ్యాధి నివారణకు ఇచ్చే టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించి రిజిస్టర్లు, నమోదు వివరాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల్లో అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలని రైతులకు సూచించారు. టీకాల కార్యక్రమాలను సమయానికి పూర్తిచేయాలని, పశు రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అంబాజీ, ఎంపీడీవో రాధారాథోడ్, పశువైద్య అధికారి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు మేకల రాజేందర్ యాదవ్, సుక్కు ముత్తన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఫార్మసీ అసోసియేషన్ సభ్యులతో, ఫార్మాసిస్టులతో గురువారం దివ్యగార్డెన్‌లో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ... అర్హత గల డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎంటీపీ కిట్స్, మందులను రోగులకు అమ్మరాదని తెలిపారు. అదే విధంగా లైసెన్స్ పొందిన ఫార్మాసిస్ట్ మాత్రమే మందులను విక్రయించాలని కోరారు. మందులను సరైన ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, జిల్లాలోని ఫార్మాసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

భైంసా సబ్ కలెక్టర్‌గా అజ్మీరా సంకేత్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన సబ్‌కలెక్టర్

భైంసా/నిర్మల్‌టౌన్ : ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్‌గా అజ్మీరా సంకేత్ కుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఉదయం వేళలో బాసర అమ్మవారిని దర్శించుకొని భైంసా కార్యాలయానికి వచ్చిన సబ్ కలెక్టర్‌కు భైంసా అర్‌డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం సబ్ కలెక్టర్‌గా అజ్మీరా సంకేత్ కుమార్ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆర్డీవో కోమల్ రెడ్డి సబ్‌కలెక్టర్‌కు బాధ్యతలను అప్పచెప్పారు. బాధ్యతల స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలలో కలియ తిరిగి ఆయా విభాగాల ఇన్‌చార్జిలను పరిచయం చేసుకున్నారు. కార్యాలయ నిర్వహణ తీరును పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్యాలయపు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ విధుల నిర్వాహణ సరియైన రీతిలో సకాలంలో సక్రమంగా కొనసాగాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లతో మాట్లాడారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలివెళ్లి కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సబ్‌కలెక్టర్లు భైంసా డివిజన్ పరిస్థితులపై చర్చించారు.

నకిలీ బిల్లుల వ్యవహారంలో

ఏఈ సస్పెన్షన్

ముథోల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ పీఆర్ పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చాక విచారణ జరిపినట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నకిలీ బిల్లుల వ్యవహారం నిజమేనని తేలినందున ఆయనను సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకూడదని, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీలో మస్కాపూర్ విద్యార్థికి సీటు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముద్రకోళ్ల శివసాయికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రావు తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

అబుదాబి జైల్లో ఉన్న మధుకర్‌ను విడుదల చేయాలి

సారంగాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవితండాకు చెందిన మధుకర్‌ను అబుదాబి పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జాదవ్ గణేష్ గురువారం ఎన్ఆర్ఐ, అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్లను సంప్రదించారు. అబుధాబిలోని భారత రాయబార కార్యాలయానికి సమాచారాన్ని అందించాలని కోరారు. అలాగే అక్కడి పోలీసులు అరెస్టు చేసిన మధుకర్‌ను వెంటనే విడుదల చేసి స్వదేశానికి పంపించాలని పేర్కొన్నట్లు తెలిపారు.

ఖానాపూర్‌లో రెండు ఆస్పత్రుల సీజ్

- డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



ఖానాపూర్‌లో ఆస్పత్రి సీజ్‌చేస్తున్న అధికారులు

ఖానాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో గురువారం నిర్మల్ డీఎంఅండ్‌హెచ్‌వో రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులు లేని రెండు ఆసుపత్రులను సీజ్ చేసినట్లు రాజేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని సూర్య హాస్పిటల్, గీతా క్లినిక్‌లను సీజ్ చేశామన్నారు. సూర్య హాస్పిటల్‌కు అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామని, గీతా క్లినిక్‌ను అర్హత లేని వైద్యులు నిర్వహిస్తున్నారని గుర్తించి సీజ్ చేశామని పేర్కొన్నారు. ఖానాపూర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఖచ్చితంగా అనుమతులు లేని ఆసుపత్రులను ఉపేక్షించబోమన్నారు. అర్హత లేని వారు ఆసుపత్రులను నిర్వహించవద్దని అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం గాంధీ నగర్‌లోని బస్తీ దవాఖానాను ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సౌమ్య, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రవీందర్, సంతోష్, తదితరులున్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

టెంబుర్నిలో మహా సంపర్క్ అభియాన్

నర్సాపూర్(జి), ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంబుర్ని గ్రామంలో బీజేపీ నాయకులు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అదేసమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్థానిక ఎన్నికలు కూడా నిర్వహించలేని స్థితిలో ఉందని అన్నారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చందు గౌడ్, కోశాధికారి సంగెం అశోక్, బూత్ అధ్యక్షులు మీనా సంతోష్, శనిగారపు రాజు, మాజీ పాక్స్ వైస్ చైర్మన్ భోజన్న, సీనియర్ నాయకులు నరేష్, దాసరి శంకర్, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

కడెంలో..

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఎలగడప గ్రామంలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ కడెం మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా బూతులలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాల గురించి, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కడెం మండల బీజేపీ నాయకులు మోహన్ నాయక్, పూస శ్రీరాం కిష్టయ్య, ఎం. గంగాధర్, ఎస్. ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం



విద్యుత్ సబ్ స్టేషన్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సిరికొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలో నూతనంగా మంజూరు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ పనులను విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల మాజీ జడ్పీటీసీ కుంరం చంద్రకళ రఘురామ్, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మన్, ఇస్రూ, అశోక్, విద్యుత్ అధికారులు ఏఇ రోహిదాస్, లైన్ వర్క్ ఇన్స్పెక్టర్ విష్ణు, లైన్‌మెన్ నందుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్‌పై కేసు ఎత్తివేయాలని విద్యార్థుల ర్యాలీ

తాంసి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న కీర్తిరాజా గీతేష్‌పై నమోదైన కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తమ ఉపాధ్యాయుడు తమకు కావాలంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులు రాసిన వినతిపత్రాలను సంబంధిత ఎంఈఓ, ఎస్ఐలకు అందజేశారు.

చివరిదశకు నూతన ఓటరు జాబితా

» ఒకే వార్డులో కుటుంబ సభ్యులందరి ఓట్లు » వార్డుల వారీగా ఓటర్ల మార్పు,చేర్పుల పూర్తి
» వేగవంతంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ » ఓటరు జాబితాలో లోపాలకు తావులేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి



ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

భైంసా, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం నూతన ఓటరు జాబితా సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ నూతన ఓటర్ జాబితా తయారీకి కసరత్తు పూర్తిచేసింది. పంచాయతీ రాజ్ శాఖ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, బూత్‌లెవల్ అధికారులు తమ గ్రామాల పరిధిలో నూతన ఓటర్ జాబితా ఏర్పాటును పూర్తి చేశారు. శుక్రవారం లోగా ఓటరు కొత్త ఓటరు జాబితాను టీపోల్‌లో నమోదు చేయాలని జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా ఎంపీడీవో కార్యాలయాల నుంచి సంబంధిత ప్రక్రియ పూర్తయ్యే దశకు చేరుకుంది.

ఒకే వార్డు పరిధిలో కుటుంబీకులందరి ఓట్లు

నూతన ఓటరు జాబితా ప్రకారం ఆయా గ్రామాల్లోని కుటుంబీకులందరి ఓట్లు ఒకే వార్డులో ఉండనున్నాయి. ఇదివరకు కుటుంబాల్లోని ఓట్లు ఒక వార్డులో కాకుండా వివిధ వార్డులలో ఉండేవి. ప్రస్తుతం సిద్ధమైన ఓటరు జాబితాలో కుటుంబీకులందరి ఓట్లు ఒకేవార్డు లో ఉండనున్నాయి. గ్రామాల వారీగా సంబంధిత అంశాన్ని ప్రధానంగా తీసుకొని నూతన ఓటరు జాబితా సిద్ధమైంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, బూత్‌లెవల్ అధికారులు లోపాలకు తావులేకుండా నూతన ఓటరు జాబితా ఏర్పాటు ముమ్మర చర్యలు చేపట్టారు.

టీపోల్ పోర్టర్‌లో వేగవంతంగా నమోదు

ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన జాబితాలోని ఓటర్ల పేర్లు వార్డుల వారీగా టీపోల్ పోర్టర్‌లో నమోదు వేగవంతంగా జరుగుతోంది. ఎంపీడీవో కార్యాలయాల్లో ఆయా మండలాల ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ కంప్యూటర్ సిబ్బంది నమోదును ముమ్మరం చేశారు. ఆయా మండలాల ఎంపీడీవోలు ఆన్‌లైన్ నమోదుపై ఎప్పటికప్పుడ సమీక్షిస్తూ సిబ్బందికి దిశా, నిర్దేశం చేస్తున్నారు.

జిల్లాలో 3,368 వార్డులు

జిల్లాలోని 18 మండలాల్లో 400 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 3,368 వార్డులున్నాయి. పోలింగ్ కేంద్రాలు కూడా 3,368 ఉన్నాయి. ఇదివరకు ప్రకటించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 4,46,219మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 2,33, 687, పురుషులు 2,17,517, ఇతరులు 15 మంది ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

పెంబి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని లోతర్య గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యమని, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, సూచించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో తల్లిపాల వారోత్సవాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రీప్రైమరీ (అంగన్‌వాడీ) పాఠశాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపారు. గర్భిణీ, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, స్వచ్ఛంద సంస్థ మేనేజర్ బ్రహ్మన్న, ఉపాధ్యాయురాళ్లు పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

మున్నూరుకాపు సంఘం ఎన్నిక

తానూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేల్‌తరోడగా గ్రామంలో గురువారం నూతనంగా మున్నూర్‌కాపు సంఘాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం నూతన అధ్యక్షులు ధర్మపురి పండరి తెలిపారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షులు పండరి, ఉపాధ్యాక్షులుగా మేకల రాజేశ్వర్, కోశాధికారిగా గోప బాలాజీ, సహా కార్యదర్శిగా ముంగేటి శంకర్, సలహాదారులుగా ధర్మపురి దత్తు, ముంగట్ దేవన్న, సభ్యులుగా జి ధర్మన్న, ఏ సాయన్న, పోశెట్టి, సాయినాథ్, సి. దత్తు, పి దత్తు, కే గోపాల్, పి బాలాజీ, జీ దత్తు, డి శంకర్, ఎం శ్యామరావ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సారంగాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్మల్ పట్టణం లోగల చైన్‌గేటు సమీపంలో ఉన్న కొమురంభీం విగ్రహం దగ్గర నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్మల్ జిల్లా నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుతు పోతుండ్ల శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నిర్మల్ రూరల్: ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసి నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ముచ్చిండ్ల రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలందరూ గ్రామాల్లో ప్రధాన కూడళ్ల, సంఘ భవనాల వద్ద ఆదివాసి జెండాలను ఆవిష్కరించి జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనుగొండ సతీష్, కోశాధికారి సాయన్న, కస్తూరి భీమేశ్వర్, బాపయ్య, ముత్తన్న, శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన గ్రంథాల సంస్థ చైర్మన్ నాయకులు

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించండి

సీఎంను కోరిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

బోథ్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం సాయంత్రం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకంతో గ్రంథాలయ చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఆత్మ మాజీ చైర్మన్ రాజు యాదవ్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఉన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బోథ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌దరి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు సిలిండర్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన వారిని గురువారం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడడం జరిగింది. ఇలాంటి ఆందోళన చెందవద్దని తాము అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆయనవెంట పోతు మండల సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, నాయకులు, డాక్టర్ స్వామి పలువురు ఉన్నారు.

జోరుగా వాన.. పొంగిన వాగులు

బోథ్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని చింతల బోరిలో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల సమీపంలోని వాగులు పొంగి ప్రవహించాయి. కొద్ది సమయంలోనే వాతావరణం మారిపయి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షంతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కుంటాల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో ముత్యం అన్నారు. గురువారం మండలకేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి తలెత్తకుండా సక్రమంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయనవెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి,తదితరులున్నారు.

ముత్తడివాగులో దూకి ఒకరి ఆత్మహత్య

తలమడుగు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ అనే వ్యక్తి ముత్తడివాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ తన వారసత్వ భూమి విషయంలో తన తండ్రితో కొద్ది రోజులుగా గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఉదయం 10 గంటలకు బాగా మద్యం తాగి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు బంధువులు, చుట్టుపక్కల వెతకగా ఎక్కడా ఆచూకీ దొరకలేదు గురువారం ఉదయం 8గంటలకు సుంకిడి వాగులో అతని మృతదేహం ఉండడాన్ని చూసిన మృతుడి తల్లి, దాసరి ఎర్రన్న చూసి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. మృతుడికి భార్య, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు.

లాడ్జిలో ఉరేసుకుని మరొకరు..

తలమడుగు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడదు గ్రామానికి చెందిన తలర్ల సాయికృష్ణ నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఓ లాడ్జిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఖోడద్ గ్రామానికి చెందిన సాయి కృష్ణ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని కుటుంబీకులు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులతో హైదరాబాదు నుంచి నిర్మల్‌లోని ఓ లాడ్జిలో ఉరేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

గంజాయి మొక్కను పెంచిన వ్యక్తి రిమాండ్

ఇంద్రవెల్లి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కను పెంచుతున్న ఓ వ్యక్తిని గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని మెండపల్లి గ్రామానికి చెందిన కోట్నాక్ శంకర్ తన ఇంటి ఆవరణలో నిషేధిత గంజాయి మొక్కను పెంచుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసుబృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కోట్నాక్ శంకర్ ఇంటి ఆవరణలో ఏడు అడుగుల ఎత్తు ఉన్న గంజాయి మొక్కను కూడా స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తన సొంత అవసరాలకు వాడుకుంటున్నానని శంకర్ చెప్పినట్టు ఎస్సై తెలిపారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసునమోదు చేసి శంకర్ అరెస్టుచేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

బోథ్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): బోథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరలపల్లి కంటేగాం గ్రామాల సమీపంలో గత రెండు రోజుల క్రితం అక్రమంగా నిషేధిత గడ్డి మందులు తీసుకొస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. దాదాపు 10లీటర్ల వరకు గడ్డిమందు డబ్బాలు ఉన్నట్లు సమాచారం. అయితే మహారాష్ట్ర నుంచి ఇచ్చోడ నేరడిగొండ బజార్హత్నూర్ మండలాలకు చెందిన కొందరు నిషేధిత గడ్డి మందును తీసుకువచ్చి దొంగచాటుగా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

భైంసాలో అమానవీయ ఘటన



మురికి కాలువలో మృతశిశువు పిండం

• కాలువలో మృతశిశువు పిండం

భైంసా, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): భైంసాలో అమానవీయ ఘటన వెలుగు చూసింది. స్థానిక రేయిన్‌బో హైస్కూల్ ఎదుట గల మురికి కాలువలో మృతిచెందిన శిశువు పిండం లభ్యమైంది. మధ్యాహ్న సమయంలో అటు వైపుగా వెళ్తున్న కొందరు మురికి కాలువలో పిండాన్ని చూశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి మురికి కాలువలోని పిండాన్ని బయటకు తీశారు. అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతిచెందిన శిశువు 5 నుంచి 6నెలల వయస్సుతో ఉన్నట్లుగా సమాచారం. శిశువుపిండాన్ని చూసిన పలువురు కంటితడి పెడుతూ బాధ్యులు, కారకులపై తిట్ల దండకాన్ని అందుకున్నారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



కుచిలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థులు



దిలావర్‌పూర్‌లో రాఖీలు కడుతున్న బాలికలు



ఖానాపూర్‌లో..

బోథ్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలో గురువారం రాఖీ పండుగ రక్షాబంధన్ వేడుకలను ముందస్తుగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో విద్యార్థులు రాఖీ రక్ష బంధన్ ఆకారంలో కూర్చొని రాఖీ పండుగ ప్రాముఖ్యతను ప్రదర్శించారు. కుచ్చులాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాఖీను కట్టుకొని అన్నా అక్క చెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. అలాగే మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టి రాఖీ పండుగ ముందస్తు వేడుకలు జరుపుకున్నారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని బుగ్గరాం బీ గ్రామంలో గల మండలం పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు రాఖీ పండుగను జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నేరడిగొండ జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, బుగ్గరాం ప్రధానోపాధ్యాయురాలు సునీత విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు వెంకటరమణ, లీలావతి తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజులదేవి రమేష్ బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, మౌనిక, రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఖీ పండుగ విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు సదానంద్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అబ్బాయిలకు బాలికలు రాఖీలు కట్టారు. పీడీ అంబాజీ అన్నారు.



రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఖానాపూర్: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండల కేంద్రంలోని ధ్రువ హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించి రాఖీ పౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, బోరిగాంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం రక్షాబంధన్ సంబురాలు నిర్వహించారు. రక్షాబంధన్ అనేది తోబుట్టువుల ఆత్మీయ సంబంధానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులున్నారు.

ముథోల్: ముథోల్‌లోని రబింద్ర ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ పండుగ విశిష్టత గురించి తెలియజేసి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ముత్యం, రాము, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృత్యువాత



మృతి చెందిన ఎద్దు

కడెం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లె డలో లచ్చన్న అనే రైతుకు చెందిన ఎద్దు గ్రామ సమీపంలో మేతకోసం వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.70వేలు వరకు ఉంటుందని బాధితుడుతెలిపాడు.

క్విట్ ఇండియా వార్షికోత్సవ పోస్టర్ల విడుదల

నిర్మల్‌రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గాంధీ పార్క్‌లో క్విట్ ఇండియా 83వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టర్లను విడుదల చేసినట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య తెలిపారు. ఈనెల 13న జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రాజు, ఎస్ఎన్ రెడ్డి, కే. రాజన్న, హరిత, తిరుపతి, శ్రీనివాస్, భూమన్న, గంగారాం, రమేష్ పాల్గొన్నారు.

మానవ జీవన విధానంలో రసాయన శాస్త్రానిదే ప్రధాన భూమిక

భైంసా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మానవ జీవన విధానంలో రసాయన శాస్త్రం ఎంతో ప్రాధాన్యతమైనదని భైంసా గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య పేర్కొన్నారు. గురువారం జాతీయ రసాయన దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రసాయన శాస్త్రం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఎంతో అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణలో రసాయన శాస్త్రమే ప్రధానమైనదన్నారు. వైద్యరంగంలో మందుల తయారీ, చికిత్సల నిర్వాహణలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పరిశ్రమల రంగంలో అనే ఉత్పత్తుల అభివృద్ధి తోడ్పాటు ఇస్తోందన్నారు. కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు రఘునాథ్ రసాయన పరికరాలు, వాటి పనితీరుతోపాటు పలు ప్రయోగాలనుచేసి విశదీకరించారు. రసాయన శాస్త్ర అవశ్యకత, ప్రాధాన్యత, ప్రాముఖ్యత అంశాలను తెలియచెప్పారు. ఇందులో కళాశాల అధ్యాపకులు డా.పవన్‌కుమార్, యు. రవికుమార్, డా.శంకర్, ఆరే రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి ప్రియాంక

ఆరోగ్య మండలం కోసం సమష్టిగా కృషి చేద్దాం

దిలావర్‌పూర్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): అన్నిశాఖల అధికారులు, సిబ్బంది కలిసి కట్టుగా సమష్టి కృషితో దిలావర్‌పూర్‌ను ఆరోగ్య మండలంగా తీర్చిదిద్దుదామని మండల వైద్యాధికారి ప్రియాంక అన్నారు. ఈనెల 11న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జరిగిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ముందస్తు సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిద్దామని తద్వారా పారిశుధ్య సమస్య తలెత్తకుండా చేయవచ్చని వివరించారు. 11న ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-19 ఏళ్ల వయస్సున్న ప్రతీఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్, ఎంఈవో శంకర్, ఆరోగ్య, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

భైంసా, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని పకడ్బందీగా నిర్వహించాలని భైంసా బస్తీ దవాఖాన వైద్యాధికారి డా.కమలేష్ సూచించారు. గురువారం భైంసా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలంలోని పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్యసిబ్బందితో నులిపురుగుల నివారణ దినోత్సవం, అల్బెండజోల్ మాత్రల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 1-19ఏళ్ల వరకూ అందరికీ అల్బెండజోల్ మాత్రలు అందచేయాలని సూచించారు. ఇందుకు గాను ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఇందులో హెచ్ఈవోలు కలీమోద్దీన్, నరేష్ పాల్గొన్నారు.

పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్

ముథోల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు పి.రమాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ నాయకులు కొందరు ప్రొసీడింగ్‌లు తీసుకొని పనులు చేయకుండా బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్డు పనులు చేయకుండా బిల్లులు మంజూరు చేయించుకోవడం అవినీతికి చేయడమేనని తెలిపారు. దీన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒక ముథోల్ మండలమే కాకుండా పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కొందరు ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని తెలిపారు. పనులపై విచారణ జరిపి సంబంధిత గుత్తేదారుల లైసెన్స్‌లు రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌కు నీటి శుద్ధి యంత్రం విరాళం

కడెం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయురాలు అప్పవర్ విజయలక్ష్మి వాటర్ ప్యూరిఫైడ్‌ను విరాళంగా అందజేశారు. 2012 నుంచి 2024 వరకు కడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ టీచర్‌గా విధులు నిర్వహించి, 2024లో మామడ మండలంలోని పొన్కల్ పాఠశాలకు పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా పాఠశాలలో పిల్లల ఆరోగ్యం దృష్ట్యా వాటర్ ప్యూరిఫైడ్‌ను అందజేసినట్లు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. కడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి విజయలక్ష్మికి పాఠశాల తరపున, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల తరపున ధన్యవాదాలు తెలిపారు.



మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న రాఖీలు

అనురాగాల దీపిక.. రక్షాబంధన్

» రేపు రక్షాబంధన్

ముథోల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణమి అని పిలుస్తారు. సోదరీ సోదరుల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. భారతదేశం అంతటా ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకుంటారు. అన్నదమ్ములకు సోదరి రాఖీ కట్టడం ఆనవాయితీ. రాఖీ అనగా రక్షాబంధనం. ఇది అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే రాఖీ. ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపతి శ్రీకృష్ణుడికి అన్నాచెల్లెళ్ల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. ఈ పండుగకు ప్రతి సోదరీ తన సోదరులకు రాఖీ కట్టేందుకు ఎంత దూరం ఉన్నా పుట్టింటికి వచ్చి రాఖీ కడుతారు. దీంతో సోదరీమణులకు అన్నలు, త మ్ముళ్లు కానుకగా డబ్బులు, వెండి, బంగారం, బట్టలు ఇస్తారు. అయితే ఈ పండుగ సోదరీ సోదరుల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రాఖీల ధరలు ఒక్క రూపాయి నుంచి ఉన్నాయి. వారి వారి స్థోమతను బట్టి తమ తోబుట్టువులకు ఈ రాఖీలను కట్టి తమ ప్రేమానురాగాలను పంచుతారు. భారతదేశంలో ఈ పండుగ ఎంతో వైభవంగా జరుపుకుంటారు. అంతేకాకుండా దూర ప్రాంతాలలో ఉన్న తమ తోబుట్టువులకు సోదరీమణులు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ రాఖీలను సైతం పంపిస్తారు.



అన్నకు రాఖీ కడుతున్న దృశ్యం (ఫైల్)

సీసీ రోడ్డు వేయకున్నా బిల్లు మంజూరు ?

» ఎడ్‌బిడ్‌లో రోడ్డు ఒక కనికట్టు
» పనులు నిలిపి వేసిన అధికారులు
» నిబంధనలకు విరుద్ధంగా అధికారుల తీరు
» కలెక్టర్ ఆదేశాలతో ఆగిన సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు వేసేందుకు చదును చేస్తున్న దృశ్యం

ముథోల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఏ గ్రా మంలోనైనా అభివృద్ధి ప నులు మంజూరైతే మొదట సంబంధిత ప నులు పూర్తి చేసిన తర్వాతనే బిల్లులు మంజూరు కావడం నిబంధనల ప్రకారం జరుగుతుంది. కానీ నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో సుమారు రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయకుండానే చేసినట్టు ఎఫ్‌టీవో జనరేట్ చేసి డబ్బులు కాజేసే ప్రయత్నం చేయగా అది బయటకు పొక్కడంతో సంబంధిత పని దక్కించుకున్న కాంట్రాక్టర్లు దిద్దుబాటు చర్యలు చేపట్టిన విషయం జిల్లాలోని చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిధులతో చేసే అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత బిల్లులు మంజూరు చేయడం జరుగుతుంది. అయితే సీసీ రోడ్లు వేయకుండా బిల్లు మంజూరు చేసిన వైనం ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పూర్తి వివరాల్లోకి వెళ్తే... ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జాతీయ, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.7 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ సీసీ రోడ్డు గ్రామంలో సాయరెడ్డి ఇంటి నుండి భూషణ్ రెడ్డి ఇంటి వరకు మార్చి నెలలో సుమారు 60 మీటర్ల పొడవు నిర్మించాలి. అయితే సీసీ రోడ్డు నిర్మించకుండానే ఏకంగా పంచాయతీ రాజ్ అధికారులు సీసీ రోడ్డు పూర్తి అయినట్లు మార్చి 30వ తేదీన ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. దీంతో బిల్లు సుమారు రూ. 6,97,287 మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మించకుండా అధికారులు బిల్లులు మంజూరు చేయటంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే వెంటనే అధికార పార్టీ నాయకులు సరిదిద్దుకునేందుకు దిద్దుబాటు పనిలో నిమగ్నమయ్యారు. దీంతో సీసీ రోడ్డుకు సంబంధించిన మెటీరియల్ బుధవారం రాత్రి స్థానిక ఆలయం సమీపాన డంపు చేశారు. తాజాగా గురువారం రోజు సీసీ రోడ్డు వేయడానికి రోడ్డును జేసీబీతో చదును చేస్తుండగా పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్ వచ్చి పనులను ఆపి వేశారు. అయితే మళ్లీ సదరు గుత్తేదారులు సీసీ రోడ్డు ప నులను ప్రారంభించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఎడ్‌బిడ్ గ్రామానికి ఎంపీడీవో శివ కుమార్‌ను పంపించి సంబంధిత సీసీ రోడ్డు పనులను ఆపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులను నిలిపి వేయాలని గుత్తేదారులకు చెప్పడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిన అధికారులే తుంగలో తొక్కడం కాకుండా మళ్లీ కప్పి పుచ్చుకోవటం ప్రయత్నం చేసే వ్యవహా రం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారం బయట పడకుంటే ప్ర భుత్వం బిల్లు స్వాహా చేసేవారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నిబంధనకు విరుద్ధంగా జరిగే పనుల్లో అధికారుల నిర్లక్ష్యమా లేదా సంబంధిత గుత్తేదారులతోని కుమ్మక్కై ఉన్నారా అనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్కడ వైద్యం చేయాలంటే..

వాగు దాటాల్సిందే!

నార్నూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన ప్రజలకు వైద్యం అందలి అంటే ఇక్కడ వైద్య సిబ్బంది వాగులు, వంకలు దాటి వైద్యం చేయాల్సిందే. ఓ వెపు భారీ వర్షాలు ప్రజలకు మెరుగైన చికిత్స అందించే కోసం ఆరోగ్య శాఖ అధికారులు పడే కష్టాలు అంత ఇంత కాదు. ఇబ్బందిగా ఉన్న ప్రజల కోసం మేము ఉన్నాం అంటూ సిబ్బంది భరోసా ఇస్తున్నారు. గురువారం ఝరి పీహెచ్‌సీ బారిక్ రావుగూడ మలంగి ఎస్సీ గుడలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ సంజయ్ ఆడె రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగాల భారిన పడితే ఆశ కార్యకర్తకు సమాచారం ఇస్తూ దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యుకు సంప్రదించాలని పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది చంద్రకళ ఏఎన్ఎం, వినోద్, మోతుబాయి, లక్ష్మీబాయి ఉన్నారు.



వాగు దాటుతున్న ఝరి వైద్య సిబ్బంది

రేషన్ కార్డుల పంపిణీలో రగడ

» కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

తలమడుగు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తనమడుగు మండలంలోని సుంకిడి రైతు వేదికలో గురువారం నిర్వహించిన తలమడుగు, తాంసి మండలాలకు సంబంధించిన నూతన రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య రగడ చోటు చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. అంతకుముందు వన మహోత్సవంలో భాగంగా గీత కార్మికులతో కలిసి ఈతమొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం ఆత్మ చైర్మన్ అశోక్ గత ప్రభుత్వంలో 10 సంవత్సరాల కాలంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డు పంపిణీలతో పాటు రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని మాట్లాడగా బీఆర్ఎస్ నాయకులు కలుగజేసుకొని వాగ్వాదానికి దిగారు, ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలకు మధ్య కూడా మాటల వాగ్వాదం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే సర్ది చెప్పగా గొడవ సద్దుమనింది.



రేషన్ కార్డుల పంపిణీలో గొడవ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు

\- జిల్లా కలెక్టర్ రాజార్షిషా

తలమడుగు అర్హులైన ప్రతీ లబ్ధిదారునికే సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తలమడుగు, తాంసి మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డు పంపిణీ చేయడం జరిగిందని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్దేశం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ఉద్దేశంతో రేషన్ కార్డు పంపిణీ చేయనున్నామన్నారు. పోషకాలతో కూడిన సన్నబియ్యాన్ని లబ్ధిదారులు అందరూ తినాలన్నారు. ప్రభుత్వ పథకాలు అన్ని పారదర్శకంగా జరుగుతున్నాయని డబ్బులు ఇచ్చి పథకాలను సద్వినియోగం చేసుకుందామని చూస్తే డబ్బులు ఇచ్చిన వారితోపాటు అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అధికారుల స్థానికంగా ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సుంకిడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సుంకిడి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించామని, అలాగే సుంకిడిలో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం జరిగితే రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలోనే పార్టీలు ఉంటాయని, అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి, బోథ్ నియోజకవర్గం ఆత్మ చైర్మన్ అశోక్, ఆర్డీవో స్రవంతి, తాంసి తహసీల్దార్ లక్ష్మి, తలమడుగు తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శంకర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రేషన్ కార్డు లబ్ధిదారులు, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నిధులు రాక మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనలు

● రాపెల్లి ఆశన్న, మండల విద్యాధికారి ఉట్నూర్



ప్రశ్న: మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి...?

జవాబు: మండలంలో 120 ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలు ఉన్నాయి.

ప్ర: ఎండీఎం అమలు తీరు ఎలా ఉంది...?

జ: మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రతిరోజు నిరంతరాయంగా మధ్యాహ్న భోజన పథకం అమలు అవుతుంది. 6500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం భుజిస్తున్నారు.

ప్ర: ఎండీఎం కార్మికులు ఎందరు పని చేస్తున్నారు...?

జ: మండలంలోని అన్ని పాఠశాలల్లో 190 మంది ఎండీఎం కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రెండు నెలల వేతనం రావాల్సి ఉంది.

ప్ర: ఎండీఎం బిల్లులు సక్రమంగా వస్తున్నాయా...?

జ: ప్రభుత్వం నుంచి ఇంకా ఎండీఎం బిల్లులు రావాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో జనవరి మాసం నుంచి గుడ్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కూరగాయల బిల్లులు ట్రెజరికి పంపించాం. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. రాగానే చెల్లిస్తాం.

● (ఆంధ్రజ్యోతి ఉట్నూర్)

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

» పొన్కల్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

మామడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలోని పాత చెరువు, కొత్త చెరువు తూములను పరిశీలించారు. అవి చెడిపోవడంతో నూతన తూములు నిర్మించడానికి నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధన అందించాలని విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు.

సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

మామడ మండలం కమల్‌కోట్ గ్రామంలో రూ. 5 లక్షలతో యాదవ సంఘం భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశా రు. అనంతరం సంఘ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మండల నాయకులు పాటుకూరి బాపురెడ్డి, కోండ్ర రాజారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జాలం సింగ్, రమణ, సూరితో పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మహేశ్వర్ రెడ్డి

డిసెంబరులో సీఎం మారబోతున్నారు..



మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

» బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

భైంసా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న డిసెంబర్ మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మారబోతున్నారని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి జోస్యం చెప్పారు. గురువారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులు ఢిల్లీలో డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ అగ్రనేతలంతా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నిరసనలు చేపడితే జాతీయ నాయకత్వం ప్రతినిధులు హాజరు కాకపోవడం వెనుక గల అం తర్యమేమిటన్నారు. పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌లతో పాటు ఢిల్లీలోని ప్రధాన నేతలు ఎందుకు హాజరు కాలేకపోయారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానమివ్వాలని ప్రశ్నించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సచివాలయం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావుకు వినతి పత్రం ఇచ్చినట్లు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఫెడరేషన్ ప్రతినిధులు డి. సుధాకర్, జాతీయ సెక్రటరీ జనరల్, ఆర్థిక కార్యదర్శి రాజేంద్ర బాబు, జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి పదవి విరమణ పొందిన పెన్షనర్లందరికీ రావలసిన ఆర్థిక పరమైనటువంటి సమస్యలను తీర్చవలసిందిగా, పీఆర్సీ నివేదిక సత్వరమే తెప్పించుకొని దాన్ని అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఆర్‌లని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, ఉమాదేవి, నాగమాంబ, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న

బీసీ రిజర్వేషన్లపై ద్వంద వైఖరిని ఖండించిన ఆప్

నిర్మల్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్, బీ జేపీ అనుసరిస్తున్న ద్వంద వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అన్నారు. కేవలం ఎన్నికల లబ్ధికోసమే ఈ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

» భైంసాలో ముగిసిన రాష్ట్ర స్థాయి ఖేల్‌కూద్ పోటీలు
» విజేతలకు బహుమతుల పంపిణీ
» మార్గదర్శనం చేసిన విద్యాపీఠం సంఘటనా కార్యదర్శి శ్రీనివాస రావు

భైంసా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన క్రీడా ప్రతిభను క్షేత్రస్థాయి పోటీల్లోనూ కొనసాగించి జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యా పీఠం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావ్ అన్నారు. గురువారం భైంసాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేల్ కూద్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓట మి చెందిన క్రీడాకారులు నిరాశ చెందకుండా స్ఫూర్తిదాయమైన పోటీతత్వంలో రానున్న రోజుల్లో జరిగే పోటీల్లో దీటుగా రాణించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర స్థాయిలో పోటీల్లోనూ విజేతలు త్వరలోనే జరుగనున్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల క్షేత్రస్థాయి పోటీల్లోను విజయకేతనం ఎగురవేసి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యే దిశగా క్రీడా నైపుణ్యతతో వ్యవహరించాలన్నారు. క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగడమే కాకుండా శరీర దారుఢ్యం చేకూరుతుందన్నారు. చక్కటి వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా సాహస ప్రవృత్తి నిర్మాణం సైతం చేకూరుతుందన్నారు. భైంసా అగ్నిమాపక శాఖాధికారి రవి మాట్లాడుతూ సరస్వతీ శిశు మందిరాల్లో నైతికతతో కూడిన గుణాత్మక విద్యను అందించడమే కాకుండా విద్యార్థులను అన్ని రంగాల్లోనూ నిష్ణాతులుగా తీర్చిదిద్దే దిశగా నిర్వాహణ వ్యవస్థ కొనసాగుతోందన్నారు. శిశు మందిర్ విద్యా సంస్థలు సంస్కృతి, సంప్రదాయలు, అచార వ్యవహారాలను ప్రతిబింబించే కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లోని విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది. ముగింపు వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యాపీఠం శైక్షణిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ వేణుమాదవ్‌తో పాటు ప్రబంధకారిణి ప్రతినిధులతో పాటు పలువురు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న భైంసా అగ్నిమాపక శాఖాధికారి రవి

బల్దియా నేతల బరితెగింపు

- తాము చెప్పిందే చేయాలంటూ అధికారులపై ఒత్తిళ్లు
- అడ్డగోలు పనులతో వివాదాల్లో చిక్కుకుంటున్న అధికారులు
- అక్రమ నిర్మాణాలు, అనుమతులు, కబ్జాల వెనుక నేతల హస్తం
- తెలివిగా తప్పించుకుంటున్న అసలు సూత్రధారులు
- ఆదిలాబాద్ మునిసిపాలిటీలో పెరిగిపోతున్న నేతల ఆగడాలు



ఆదిలాబాద్ మునిసిపాలిటీ కార్యాలయం

ఆదిలాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మునిసిపాలిటీలో అక్రమ దందాలు, బ్లాక్ మెయిల్‌తో కొంతమంది బల్దియా నేతలు బరితెగిస్తూ అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనుల్లోనూ పెత్తనం చెలాయించడం పరిపాటిగానే మారుతోంది. నేతల ఒత్తిళ్లు, కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు పెడుతున్నారు. తాజాగా బోధన్‌లో సస్పెన్షన్‌కు గురైన ఆర్ఓ జాదవ్ కృష్ణ గతంలో కొంత మంది బల్దియా నేతల ఒత్తిళ్లతోనే అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం కూడా కొంతమంది అధికారులు నేతల ఒత్తిళ్లను తట్టుకోలేక సెలవుల్లో వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. పదవీ కాలం ముగిసినా ఇంకా బల్దియా నేతలుగానే కొనసాగుతున్నారు. నిత్యం మున్సిపల్ కార్యాలయంలో మకాం వేస్తూ అడ్డగోలు పనులకు తెరలేపుతున్నారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, ప్రొసీడింగ్‌ల జారీలోను గల్లీ లీడర్లే పెత్తనం చలయిస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. బల్దియాలో నేతల పెత్తనం పెరిగిపోవడంపై పట్టణ ప్రజలు విసుగెత్తి పోతున్నారు.

చెప్పింది వింటే సరే..

మున్సిపాలిటీ లో మేం చెప్పింది వింటే సరే లేదంటే బదిలీ చేయిస్తామంటూ బెదిరింపులకు దిగడం కొంత మంది నేతలకు అలవాటుగానే మారింది. అధికారుల తప్పిదాలను ఆసరాగా చేసుకుంటున్న నేతలు బ్లాక్‌మెయిల్ దందాలకు దిగుతున్నారు. గత్యంతరం లేక బల్దియా నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న శాఖపరమైన చర్యలతో అధికారులు బలవుతున్నారు. అధికారులు పలు వివాదాల్లో చిక్కుకుని సతమతమవుతున్నారు. అండగా ఉంటామని నమ్మబలుకుతు ఆ తర్వాత పని పూర్తికాగానే చేతులేత్తేస్తున్నారు. అధికార పార్టీ నేతలు, రాష్ట్రస్థాయి అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయని చెబుతు అధికారులను బుట్టలో వేసుకుంటున్నారు. అడ్డగోలుగా ఫైరవీలు చేస్తూ అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయాలన్న కొంతమంది నేతల అనుమతి తీసుకోవాల్సి వస్తుందని అధికారులు వాపోతున్నారు. దీన్నిబట్టి చూస్తుంటే బల్దియా నేతల ఆగడాలు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తునే ఉంది.

తెర వెనుకుండి తతంగం..

కొంతమంది బల్దియా నేతలు తెర వెనుకుండి అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలను చేస్తూ అడ్డగోలుగా తతంగాన్ని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా కొంతమంది నేతల తీరు కనిపిస్తుంది. ఇటీవల వెలుగులోకి వచ్చి కొన్ని సంఘటనలను పరిశీలిస్తే బల్దియా నేతల అక్రమ బాగోతం బయట పడుతుంది. మునిసిపల్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రోడ్డును కబ్జాచేసి అసెస్మెంట్ చేసి ఓపెన్ ప్లాట్‌ను ఆక్రమించుకున్న సదరు వ్యక్తికి ఓ తాజా మాజీ కౌన్సిలర్ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో అక్రమాలకు పాల్పడిన వారి ని అరెస్టు చేసిన పోలీసులు అసలు సూత్రదారిని వదిలి పెట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. అలాగే బ్రహ్మణవాడకు చెందిన ఓ వ్యాపారి ఇంటికి అనుమతులు ఇవ్వకుండా అధికారుల పై ఒత్తిళ్లు చేసి ముటేషన్ అడ్డుకోవడంతోపాటు డబ్బులు డిమాండ్ చేసిన ఓ కౌన్సిలర్ భర్తను పోలీసులు అరెస్టు చేశారు. దస్నాపూర్‌కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి 2012లో కేఆర్‌కే కాలనీలోని సర్వే నెంబర్ 68/34లో ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేయకుండా ఓ మాజీ కౌన్సిలర్ ఇబ్బందులకు గురిచేయడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇలా చెప్పుకుంటు పోతే బల్దియా నేతల ఆగడాలకు అంతే లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

చేతికి మట్టి అంటకుండా..

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో విలువైన స్థలాల కబ్జాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, డోర్ నెంబర్ల కేటాయింపు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల్లో అడ్డుగోలుగా వసూలు చేస్తూ దండుకుంటున్న కొంత మంది బల్దియా నేతలు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమాలు, అడ్డగోలు పనులకు పాల్పడుతు చేతికి మట్టి అంటకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇంటి నిర్మాణం చేపట్టే యజమానులను టార్గెట్ చేస్తూ ముప్పుతిప్పలు పెట్టి దండుకోవడం కొందరికి అలవాటుగానే మారుతుంది. లక్షల్లో డిమాండ్ చేయడం, కాదు కూడదంటే అధికారుల చేత ఇబ్బందులకు గురిచేయడం గల్లీ లీడర్స్‌కు వెన్నెతో పెట్టిన విద్యగా మారిందన్న టాక్ వినిపిస్తుంది. అలాగే సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు చేస్తూ చిత్ర విచిత్రమైన ప్రశ్నలతో అధికారులను తమ దారికి తెచ్చుకుంటున్నారు. అమాయక ప్రజలను ముందుంచి తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తూ తప్పించుకుంటున్నారు. ఇప్పటివరకు బల్దియానేతలపై నమోదైన కేసులు, ఆరోపణలు, ఫిర్యాదులు, అక్రమాల్లో మరింత లోతుగా దర్యాప్తు జరిపితే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

ప్రధాని మోదీని కలిసిన ఎంపీ

» చేనేత వస్త్రాలు అందజేత



ప్రధాని మోదీకి చేనేత వస్త్రాలను అందజేస్తున్న ఎంపీ నగేష్

ఆదిలాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మికులు వేసిన దవతి, రుమాలు వస్త్రాలను ప్రధానికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ వయా పటాన్‌చెరువు రైల్వే లైన్ నిర్మాణం, సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ప్రధానితో చర్చించినట్లు ఎంపీ నగేష్ తెలిపారు. పలు సమస్యలపై ప్రధాని నరేంద్రమోదీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

» ఎమ్మెల్యే పాయల్ శంకర్

మావల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మావలలోని రత్న గార్డెన్స్‌లో గురువారం తెలంగాణ యోగసన స్పోర్ట్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 6వ యోగా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన యోగా విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రస్థాయి పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యోగాతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, సుహాసిని రెడ్డి, తిరుపతి, లాలమున్న. దయాకర్, యోగ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాంసి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్ రాష్ట్రరహదారిపై తాంసి పోలీసులు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అనుమతి లేని సరుకులను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతీ సంబంధిత పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని అన్నారు. నెంబరు లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఉత్తమ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ బీఎడ్ కళాశాల ప్రవేశాల

గడువు పొడిగింపు

ఉట్నూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాల ప్రవేశాల గడువు పొడిగించినందున అర్హులైన గిరిజనులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎడ్ 2025-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల దరఖాస్తు గడువును ఈనెల 14 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 8 వరకు ఉండగా 14వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశ కౌన్సిలింగ్ 14 నుంచి 21వ తేదీకి మార్చామని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డుపైనే మురికి నీరు

» కంపు కొడుతున్న కాలనీ పరిసర ప్రాంతాలు
» మురికి కాలువలు నిర్మించాలంటున్న కాలనీవాసులు

బోథ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలోని బ్రహ్మంగారి కాలనీలో మురికి కాలువలు లేక రోడ్లపైనే మురికి నీరు ప్రవహిస్తోంది. ఆ దుర్వాసన అంతా ఇళ్లలోకి వస్తోందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల నుంచి బయటికి వెళ్లాలంటే మురికి నీటిలోంచి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. నూతనంగా ఏర్పడిన ఈ కాలనీలో ఇళ్ల నిర్మాణం జరగడం, కాలనీలో ఉంటున్న ఇళ్లలో వినియోగించిన నీరు మురికి కాల్వలు లేక రోడ్లపై ప్రవహిస్తోందని, అధికారులు స్పందించి కాల్వలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలనీలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్ ఎమ్మెల్యేను కలిసిన ఉపాధ్యాయులు

నేరడిగొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కన్గుట్ట పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నెరడిగొండ మండలకేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం బజార్‌హత్నూర్‌లోని తుకాన్‌పల్లి గ్రామస్థులు ఎమ్మెల్యేను సన్మానించి పలు సమస్యలను వివరించారు. నేరడిగొండ వాసులు సైతం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం




శంకర్‌గూడలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని శంకర్‌గూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీల అన్నారు. గురువారం మండలంలోని శంకర్‌గూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకత, ప్రయోజనాలపై సీడీటీవో మాస ఉమాదేవి, సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్ కుసివర్తలతో కలిసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సింధుబాయి, భూలక్ష్మి, ఆశాకార్యకర్త గాయబాయి, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

గుడిహత్నూర్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావ్‌మోకాశీ పిలుపునిచ్చారు. ప్రతీ ఆదివాసీ గ్రామంలో జెండా ఎగురవేయలన్నారు. అనంతరం ఆదివాసీ సేన జిల్లా కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రాయిసిడం జంగుపటేల్, ప్రధానకార్యదర్శిగా తోడసం లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా ఆడేం పోల్లన్న, పేందోర్ కేశవ్, మండడి లక్ష్మణ్, మడవి నగేష్, సంయుక్త కార్యదర్శులుగా గేడం రమేష్, అత్రం రవీ, ఆత్రం శ్రీకాంత్, కోశాధికారిగా శ్యాంరావు, ఆదివాసి విద్యార్థి సేన జిల్లా కన్వీనర్‌గా గణేష్, కోకన్వీర్లుగా చత్రుఘున్, తోడషం ప్రవీణ్, రైతు సేన కన్వీనర్‌గా వేడ్మచంపత్‌రావు, మరికొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీసేన రాష్ట్ర నాయకుడు పెందుర్ విశ్వనాథ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ విజేతకు సన్మానం



కోట్నాక్ జాకేష్‌ను సన్మానిస్తున్న గిరిజన క్రీడల అధికారి, ఉపాధ్యాయులు

బజార్‌హత్నూర్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బజార్‌హత్నూర్ మండల పరిధిలోని జాతర్ల గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల విద్యార్థి కొట్నాక్ జాకేష్ రెండు పథకాలు సాధించిన సందర్భంగా క్రీడాపాఠశాలలో ఆయనకు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హెచ్‌ఎం ఎం.కిషన్, మడావి కృష్ణారావు మాట్లాడారు. కిడ్స్ జావెలిన్‌త్రోలో బంగారు పతకం, ట్రయత్లాన్‌లో కాంస్య పతకాలు గెలుపొంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కొట్నాక్ జాకేష్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాకేష్ తండ్రి కోట్నాక్‌జంగును కూడా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తలుసంపమన్న పీడీ మోహన్‌సింగ్,కోచ్ సాహుల్, కార్తికుమార్‌లు పాల్గొన్నారు.



రేషన్‌కార్డును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



ఉల్లాస్ శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

వయోజనుల విద్య కోసమే ‘ఉల్లాస్’

» కలెక్టర్ రాజార్షి షా

మావల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించి దేశ అభివృద్ధికి దోహదపడే పౌరులను తయారు చేయవచ్చని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఉల్లాస్ జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం వయోజన విద్య నవభారత్ సాక్షరత కార్యక్రమం గురువారం స్థానిక డైట్ కళాశాలలో ఏర్పాటుచేసిన డీఆర్‌డీవో, మెప్మ సిబ్బందికి జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజార్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా మన్యువల్, అక్షర వికాసం, మార్గదర్శి కరదీపిక బుక్స్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ సేర్ప్, డీఆర్‌డీవో, సీసీ, మెప్మా ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 32821 మంది చదువురాని, వయోజన విద్యకు అర్హులైన వారిని గుర్తించినట్లు చెప్పారు. 25996 మందిని ఉల్లాస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే వయోజన విద్య ద్వారా చదువు నేర్పించేందుకు వాలంటీర్లు 1192 మందిని ఉల్లాస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 21,312కు చేరువలో ఉన్నామని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో డీఆర్‌డీవో రవిందర్, మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, డీఈఓ శ్రీ నివాస్, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని అమ్ముకుంటే రేషన్‌కార్డు రద్దు

ఆదిలాబాద్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, సన్నబియ్యాన్ని అమ్ముకుంటే రేషన్‌కార్డులను రద్దు చేస్తామని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం ఆదిలాబాద్‌రూరల్, అర్బన్, మావల, తలమడుగు, తాంసి మండలాల్లోని లబ్ధిదారులకు అడిషన్స్, నూతన రేషన్‌కార్డుల పత్రాలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లతో కలిసి అందజేశారు. గురువారం రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. మొత్తం దరఖాస్తులు 8359 రాగా 6677 అప్రువ్ చేసినట్లు చెప్పారు. మరో 399 తిరస్కరణకు గురయ్యాయని, ఎమ్మార్వోల వద్ద 1283 పెండింగ్‌లో ఉన్నాయని, మరో 229 డీఎస్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

రేషన్‌కార్డుల కోసం దళారులను ఆశ్రయించొద్దు

పేద, బడుగుబలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం రేషన్‌కార్డులను పంపిణీ చేయడం మంచి ఉద్దేశ్యమేనని, రేషన్‌కార్డుల కోసం దళారులను ఆశ్రయించొద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గురువారం కలెక్టర్ రాజార్షిషాతో కలిసి రెవెన్యూ గార్డెన్‌లో ఆదిలాబాద్‌రూరల్, మావల, అర్బన్ మండలాల పరిధిలో 550 మంది లబ్ధిదారులకు ఆహారభద్రత కార్డులను అందజేశారు.

డైట్ కళాశాల సందర్శన

మావల: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి ఛాత్రోపాధ్యాయులతో ముచ్చటించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోలా కిరణ్‌కుమార్, అధ్యాపకులు శివకుమార్ పాల్గొన్నారు.

నేరడిగొండ నాయబ్ తహసీల్దార్‌గా విశ్వనాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథ్

నేరడిగొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ నాయబ్ తహసీల్దార్‌గా విశ్వనాథ్ గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన మహేష్ ఆదిలాబాద్ డీఎస్‌వో ఆఫీస్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సాత్నాల మండలం నుంచి విశ్వనాథ్ బదిలీపై నేరడిగొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రైతులు మండల ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

రాజ్‌గోండు సేవా సమితితోనే సమస్యల పరిష్కారం

- రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావు



సోయం బాపురావును సన్మానిస్తున్న రాజ్‌గోండు సేవా సమితి నాయకులు

ఆదిలాబాద్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): రాజ్‌గోండు సేవా సమితితోనే ఆదివాసీల సమస్యలు పరిష్కారమవుతాయని రాజ్‌గోండు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాజ్‌గోండు సేవాసమితి మండల అధ్యక్షుడు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సోయంబాపురావును ఘనంగా సన్మానించారు. ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30 తేదీల్లో రాజ్‌గోండు సేవా సమితి ఆధ్యర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీల సమస్యలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఆదివాసీ గూడాలకు, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ సంఘాల లాగా రాజ్‌గోండు సేవా సమితి లొల్లిలుసృష్టించేది కాదని పైసలు, చందాలు వసూలు చేసేది కాదన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరుగుతున్న 44 జీవోను నిలిపి వేసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంద్రంశంకర్, సెడ్మకి ఆనంద్‌రావు, ఉయిక లక్ష్మణ్,దుర్వవిశ్వేశ్వర్, జైరాం, ఆత్రంగంగారాం, భగవాన్, మేస్రంభూమన్న, తొడసం గోపాల్, ఆత్రంనగేష్, ఆయా మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.